శ్రీవారి ఆలయంలో హుండీ లెక్కింపు 2





2 వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

## టీ పాయింట్‌లో చాయ్ తాగిన కేటీఆర్




మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బాన్సువాడ, ఎల్లారెడ్డిల్లో పర్యటించారు. ఈ క్రమంలో గాంధారి మీదుగా బాన్సువాడకు వెళ్తూ మార్గమధ్యలో కార్యకర్తలతో కలిసి చాయ్ తాగారు. పలువురితో సెల్ఫీలు దిగుతూ కార్యకర్తల్లో ఉత్తేజాన్ని నింపారు.

– అక్షరటుడే, గాంధారి

7-2-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

# ప్రచారంలో జోష్

■ సీఎం రేవంత్ రెడ్డి రాకతో కాంగ్రెస్‌లో ఉత్సాహం ■ ఎంపీ అర్వింద్ విస్తృత ప్రచారం ■ కార్నర్ మీటింగ్‌లతో బిగాల బిజీ



“ మున్సిపల్ ఎన్నికల తేదీ సమీపిస్తున్న కొద్దీ ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రధాన పార్టీల నేతలు విస్తృతంగా పర్యటించడంతో అభ్యర్థులు, కార్యకర్తల్లో జోష్ పెరిగింది. ప్రచారానికి మరో రెండు రోజులు మాత్రమే ఉండడంతో ఇంటింటికి తిరుగుతూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. నగరంలోని అన్ని డివిజన్లలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ప్రచారం చేస్తున్నారు. పార్టీల ప్రధాన నేతలు సైతం పర్యటిస్తుండడంతో కార్యకర్తల్లో జోష్ నెలకొంది.

- అక్షరటుడే, ఇందూరు

జిల్లాలోని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి పనులు శంకుస్థాపన చేశారు. సీఎం రాకతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ పెరిగింది. నగరపాలక సంస్థతో పాటు ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ మున్సిపాలిటీల అభ్యర్థులు కార్యకర్తలతో పెద్ద ఎత్తున సీఎం సభకు హాజరయ్యారు. సీఎంతో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తదితరులు తమ ప్రసంగంతో కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లో లోతుగా తీసుకెళ్లాలని సూచించారు. నిజామాబాద్ కార్పొరేషన్‌తో పాటు మున్సిపాలిటీలన్నీ గెలిచి తీరుతామంటూ ధీమా వ్యక్తం చేశారు.

### బిగాల ప్రచారం

బీఆర్ఎస్ కూడా నగర పాలక సంస్థపై ఫోకస్ పెట్టింది. కార్పొరేషన్‌లో ఎక్కువ సీట్లు గెలుచుకొని కింగ్ మేకర్ కావాలని భావిస్తుంది. మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా విస్తృతంగా పర్యటిస్తున్నారు. నిత్యం కార్నర్ మీటింగ్‌లో నిర్వహిస్తూ గతంలో తాము చేసిన అభివృద్ధిని ప్రజల ముందు ఉంచుతున్నారు. నగరాభివృద్ధి లెక్కలు చెబుతూ అభ్యర్థుల్లో కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. అలాగే ఆర్మూర్‌లో బీఆర్ఎస్‌జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి తన మాటలతో ఆకట్టుకుంటున్నారు. మరోవైపు భీమ్‌గల్‌లో మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి విస్తృతంగా పర్యటిస్తూ గెలుపు కోసం శ్రమిస్తున్నారు.

### మేయర్ పీఠం కోసం..

భారతీయ జనతా పార్టీ నేతలు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ నగరపాలక సంస్థలోని అన్ని డివిజన్‌లలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. కార్నర్ మీటింగ్‌లతోపాటు సభలు నిర్వహిస్తూ కార్యకర్తల్లో జోష్ నింపుతున్నారు. ప్రధానంగా హిందుత్వ ఎజెండా, రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చని హామీలు, లోకల్ సమస్యలతో ప్రజలను చైతన్యం చేస్తున్నారు. ఈసారి మేయర్ పీఠం కైవసం చేసుకుంటాం అనే ధీమాతో నిత్యం ఉదయం సాయంత్రం సమయంలో ప్రచారం నిర్వహిస్తున్నారు. అలాగే ఆర్మూర్‌లో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, బోధన్‌లో పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నారు.

### ఎంఐఎంలో నూతనోత్సాహం..

జిల్లాలోని నిజామాబాద్, బోధన్ మున్సిపాలిటీలలో ఎంఐఎం ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీంతో ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ బోధన్ పర్యటించి తన మాటలతో కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. అలాగే నిజామాబాదులో పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే బలాల విస్తృతంగా పర్యటిస్తూ దూసుకెళ్తున్నారు.



## కాంగ్రెస్ వైఫల్యాలపై నిలదీయండి..

**అక్షరటుడే ,భీమ్‌గల్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. భీమ్‌గల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 3, 5, 6 వార్డుల్లో నిర్వహించిన 'స్ట్రీట్ కార్నర్' సమావేశాల్లో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. తాము అధికారంలో ఉన్నప్పుడు భీమ్‌గల్‌ను గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మార్చి రూ. 200 కోట్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని గుర్తుచేశారు. మున్సిపాలిటీలో మిగిలిన పనుల కోసం తాను రూ.10 కోట్లు మంజూరు చేయిస్తే, ప్రస్తుత ప్రభుత్వం ఆ నిధులను నిలిపివేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. కక్షపూరిత రాజకీయాలతో అభివృద్ధిని అడ్డుకుంటోందని విమర్శించారు. భీమ్‌గల్‌లో రూ.40 కోట్లతో చేపట్టిన 100 పడకల ఆస్పత్రి పనులు 80 శాతం పూర్తయినా మిగిలిన 20 శాతం పూర్తి చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. బస్ డిపోను గాలికి వదిలేశారని, అక్కడ బస్సులు లేక బర్లు పడుకునే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. స్థానికంగా అందుబాటులో ఉండే బీఆర్ఎస్ అభ్యర్థులు బోదిరే లావణ్య నర్సయ్య, నీలం లావణ్య గంగాధర్, మూత లింబాద్రిలను గెలిపించాలన్నారు. 'కారు' గుర్తుపై ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## బిచ్కుందను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసింది కాంగ్రెస్సే..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** బిచ్కుందను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. బిచ్కుంద మున్సిపాలిటీ పరిధిలోని శివాజీ చౌక్‌లో కాంగ్రెస్‌కు చెందిన 12 మంది కౌన్సిలర్ అభ్యర్థులతో కలిసి ప్రచార సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్, కాంగ్రెస్ నాయకులు, మెదక్ పార్లమెంట్ ఇన్‌ఛార్జి నీలం మధు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు మాట్లాడుతూ పది హేనేళ్లుగా పాలించిన మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే జుక్కల్ నియోజకవర్గానికి చేసేందేమి లేదని విమర్శించారు. తాగునీరు, డ్రెయినేజీలు, రోడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించకుండా జుక్కల్ నియోజకవర్గ ప్రజలను అంధకారంలోకి నెట్టాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పది హేనేళ్లలో కనీసం బిచ్కుందను మున్సిపాలిటీ చేయడం చేతకాని అసమర్థుడు హన్మంత్ షిండే అని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్లలో జుక్కల్ నియోజకవర్గాన్ని కాని, బిచ్కుంద పట్టణాన్ని కాని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈరోజు ఏ మొహం పెట్టుకొని కేటీఆర్ బిచ్కుందలో ఎన్నికల ప్రచారానికి వచ్చాడని ప్రశ్నించారు. జుక్కల్ నియోజకవర్గంపై వాళ్లకు ఏ మాత్రం ప్రేమ, చిత్తశుద్ధి లేదని, కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే వాళ్లకు జుక్కల్ నియోజకవర్గం గుర్తుకు వస్తుందని,తర్వాత మళ్ళీ ఇటు దిక్కు కూడా చూడరని ఆవేదన వ్యక్తపర్చారు. కేటీఆర్‌కు దమ్ముంటే బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు జుక్కల్ నియోజకవర్గానికి ఏం చేశారో వివరించాలని సవాల్ విసిరారు. లేని పక్షంలో ఇదే శివాజీ చౌక్‌లో జుక్కల్ నియోజకవర్గ ప్రజలకు క్షమాపణలు చెప్పి పోవాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన జుక్కల్



నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి, ప్రజల బతుకులు బాగు చేయడానికి నిరంతరం శ్రమిస్తున్నానని తెలిపారు.. జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధి కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని, ఈ ప్రభుత్వ కాలంలో అభివృద్ధి చేసి ప్రజలకు స్పష్టమైన మార్పు కనపడేలా చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఈ రెండేళ్లలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, ప్రతీ పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నాని పేర్కొన్నారు. 12 వార్డుల్లోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని మున్సిపల్ ఎన్నికల ఇన్‌ఛార్జి, మంత్రి అజారుద్దీన్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని పలు వార్డులలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన ఉందన్నారు. అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేస్తున్నారని తెలిపారు. గత సర్పంచ్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు మున్సిపల్ ఎన్నికల్లో కూడా రిపీట్ కావాలని, చేతి గుర్తుకు వేసి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అహంకారం వీడితేనే అభివృద్ధి సాధ్యం అవుతుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ఎమ్మెల్యేగా వెంకటరమణా రెడ్డి గెలిచినప్పటి నుండి ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు. గతంలో ఏమీ చేయని వ్యక్తి రేపు చేస్తాడనే నమ్మకం ప్రజలకు లేదని తెలిపారు. అధికార గర్వం, ఇద్దరు సీఎంలను ఓడించానని చెప్పుకోవడం తప్ప, కామారెడ్డి కోసం ఆయన సాధించిన ఘనత ఒక్కటీ లేదని విమర్శించారు. అధికార అహం నెత్తికెక్కితే చిన్న, పెద్ద అనే వ్యత్యాసం ఉండదని, కేసీఆర్ అంతటి వాడే తన అహంకారంతో నేడు కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందని గుర్తుంచుకోవాలన్నారు. వార్డులోని ప్రతి సమస్యను తమ ఇంటి సమస్యగా భావించి పరిష్కరించే వారికే ప్రజలు పట్టం కట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.



## సర్పంచ్‌పై కేసు నమోదు..

**అక్షరటుడే, కామారెడ్డి :** పదిమందికి ఆదర్శంగా నిలవాల్సిన ఓ ప్రజాప్రతినిధి తప్పుడు మార్గం ఎంచుకున్నాడు. కూతురిని డాక్టర్‌ను చేయాలనే ఉద్దేశంతో తప్పుడు రిజర్వేషన్ సర్టిఫికెట్ పొందాడు. విచారణ చేసిన పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ప్రస్తుతం కూతురి ఎంబీబీఎస్ సీటుకు సైతం ఎసరు వచ్చింది. ఉమ్మడి మాచారెడ్డి మండలంలోని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఓ గ్రామ సర్పంచ్ గత ఎంపీటీసీ ఎన్నికల్లో తనకు 12 ఎకరాల భూమి ఉందని ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ చట్టం ప్రకారం ఐదెకరాల లోపు భూమి ఉన్నవారికి మాత్రమే రిజర్వేషన్ వర్తిస్తుండగా ఆయన దానిని తుంగలో తొక్కాడు. అక్రమ మార్గంలో కూతురికి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ పొందాడు. దాంతో ఆమెకు నిజామాబాద్ మెడికల్ కళాశాలలో 2019లో ఎంబీబీఎస్ సీటు లభించింది. ఈ విషయం సామాజిక కార్యకర్త మధుసూదన్ రెడ్డి గత ఏడాది జూన్‌లో కలెక్టర్, సంబంధిత అధికారులకు, సీఎంకు ఫిర్యాదు చేశారు. దాంతో విచారణ జరిపిన కామారెడ్డి తహశీల్దార్ జనార్దన్ కామారెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా సర్పంచ్‌పై కేసు నమోదైంది. అనంతరం మెడికల్ కమిషన్ చర్యలకు ఉపక్రమించింది. జాతీయ మెడికల్ కమిషన్ సదరు సర్పంచ్ కూతురు ఎంబీబీఎస్ అడ్మిషన్, రిజిస్ట్రేషన్ రద్దుతో పాటు రిజర్వేషన్ కింద పొందిన ఇంటర్న్‌షిప్ సభ్యత్వం రికవరీకి చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చింది. 15 రోజుల్లోగా పూర్తి నివేదిక ఇవ్వాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, యూనివర్సిటీకి లేఖ రాసినట్టుగా తెలుస్తోంది. ఈ విషయమై సామాజిక కార్యకర్త మధుసూదన్ రెడ్డిని ఫోన్ ద్వారా వివరణ కోరగా ఫిర్యాదు చేసిన మాట నిజమేనన్నారు.

## బీఆర్ఎస్ పార్టీకి పోచారం వెన్నుపోటు పొడిచారు: కేటీఆర్

**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ మున్సిపాలిటీకి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ రూ. 625 కోట్లు కేటాయించారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. బాన్సువాడ పట్టణంలో శనివారం నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాలో బాన్సువాడకు రూ. కోట్ల నిధులు రాగా.. ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ నుంచి ఒక్క రూపాయి అయినా తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో బహిరంగ సభలో మాట్లాడారు. మున్సిపల్ మంత్రిగా ఉన్న సమయంలో బాన్సువాడకు మున్సిపాలిటీ హోదా కల్పించానని గుర్తుచేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఓడగొట్టించడానికి రేవంత్ రెడ్డి ప్రచారం చేశారని.. ఇప్పుడు ఇద్దరు ఒకటయ్యారని కేటీఆర్ మండిపడ్డారు. ప్రాణం ఉన్నంతవరకు కేసిఆర్ వెంటే ఉంటానని చెప్పిన పోచారం కాంగ్రెస్ గూటికి చేరి బీఆర్ఎస్ పార్టీకి వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధికి కేసీఆర్ రూ.10వేల కోట్లు ఇచ్చారన్నారు. కాంగ్రెస్



ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలు ఒకటి నెరవేర్చలేదని దుయ్యబట్టారు. రూ. 2000 పింఛన్ రూ. నాలుగు వేలకు పెంచుతామని చెప్పి మాట తప్పారన్నారు. ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. మహిళలకు మహాలక్ష్మి పథకం రూ. 2500 ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానివి అన్నీ అబద్ధాలేనని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గట్టి బుద్ధి చెప్పాలని కోరారు. ప్రభుత్వ ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ నాయకులు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడగడానికి వస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. బాన్సువాడ నియోజకవర్గానికి 10 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేసిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేసిఆర్ కిట్లు కనుమరుగయ్యాయని, తులం బంగారం, బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుకలు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల్లో బాన్సువాడలో గులాబీ జెండా ఎగురవేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు ఒకటేనని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, అంజిరెడ్డి, జుబేర్, ధర్మ తేజ, నార్ల రత్న కుమార్, ఎలమంచిలి శ్రీనివాసరావు, బోడ చందర్ పాల్గొన్నారు.



## ఓటు వేసి గెలిపించండి.. అభివృద్ధి చేస్తా..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** తనను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని 41వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థి బూరుగుల ఇందిరా వినోద్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా బూరుగుల ఇందిరా వినోద్ కుమార్ కాలనీలో తిరుగుతూ ప్రతి ఒక్కరిని కలిశారు. బీజేపీ కి ఓటువేసి గెలిపించాలని విన్నవించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో ప్రతి ఒక్కరి సమస్యపై అవగాహన ఉందన్నారు. అవకాశం ఇస్తే వాటిని పరిష్కరించి ముందుకు వెళ్తానని ఆమె అన్నారు. ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సహకారంతో డివిజన్‌కు భారీగా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. 'మన ఇందూరు-మన మేయర్' నినాదంతో ముందుకు వెళ్తామని.. ప్రతిఒక్కరూ తమకు మద్దతు తెలిపాలని వారు కోరారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందే..




**అక్షరటుడే, బాల్కొండ:** మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాల్కొండ మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహశీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తన్న మాట్లాడుతూ కార్మికులు ఏళ్లుగా కష్టపడి సాధించుకున్న చట్టాలను కేంద్రం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తేవడం కార్మికుల హక్కులను కాలరాయడమేనన్నారు. వీటికి వ్యతిరేకంగా కార్మిక సంఘాలన్నీ పోరాటం చేస్తున్నా.. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ఈ చట్టాన్ని 2025 నవంబర్ 21న అమలు చేస్తూ నోటిఫికేష్ ఇవ్వడం సిగ్గు చేటన్నారు. తక్షణమే ఈ నాలుగు కోడ్‌లను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఈరోజు విత్తన సవరణ చట్టం, విద్యుత్ సవరణ చట్టం 2025, జీరాంజీ చట్టం, ఎల్ఐసీలో వందశాతం విదేశీ పెట్టుబడులను అనుమతించడం లాంటివి ప్రమాదకరమైన నిర్ణయాన్నారు. వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె చేస్తున్నామని.. కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీయూసీఐ ఏరియా నాయకులు ఎండీ నజీర్, నిమ్మల నిఖిల్, లలిత, లావణ్య, లక్ష్మి, విజయలక్ష్మి, గంగామణి, సరళ, సుజాత, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీవారి ఆలయంలో హుండీ లెక్కింపు

**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూర్‌లోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆలయ కమిటీ సమక్షంలో నాలుగు నెలల హుండీ డబ్బులను లెక్కించారు. ఈ మేరకు మొత్తం రూ.12.47 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బోగవల్లి అప్పారావు, నరసరాజు, సత్యనారాయణ, కిరణ్ రాజు, శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు హుండీ ఆదాయాన్ని వినియోగిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.



## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మగ్గిడి విద్యార్థులు

**అక్షరటుడే, ఆర్మూర్:** రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మగ్గిడి పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల పీడీ మధు తెలిపారు. ఈ మేరకు శనివారం వివరాలు వెల్లడించారు. కమ్మర్‌పల్లిలో 8వ తేదీ వరకు పోటీలు జరుగనున్నాయని వివరించారు. పాఠశాల నుంచి అండర్-16 బాలికల విభాగంలో హిమతేజ, విజ్ఞత, హిమప్రియ, ప్రణీతం, అద్విత ఎంపికయ్యారన్నారు. అలాగే బాలుర విభాగంలో హరికృష్ణ ఎంపికైనట్లు పీడీ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం తిరునగిరి హరిత, రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి హనుమంత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లేష్ గౌడ్ అభినందించారు.



## ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తాం

**అక్షరటుడే, కామారెడ్డి:** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని 10వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి నీలం కళావతి రమేష్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం దేవునిపల్లి గ్రామంలో తన భర్త రమేష్‌తో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 'అవ్వా.. తాత.. నీ ఓటు నాకే వేయాలి..' అంటూ వృద్ధులు, మహిళా ఓటర్లను కళావతి రమేష్ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వార్డు ప్రజల సమగ్రాభివృద్ధికి ప్రత్యేకంగా మేనిఫెస్టో తయారు చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో గెలవడం కోసం మేనిఫెస్టో తయారు చేయలేదని, గెలిచిన తర్వాత మేనిఫెస్టో ప్రకారం అన్ని హామీలు నెరవేరుస్తామన్నారు. ఒక్కహామీ అమలు చేయకున్నా తమను నిలదీసే హక్కు ప్రజలకు ఉందని పేర్కొన్నారు. వార్డు ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని తెలిపారు. నిరుపేద కుటుంబాలను ఆదుకుంటామని, వారి పిల్లల చదువుకు బాసటగా నిలుస్తానని పేర్కొన్నారు. వార్డు అభివృద్ధికి ప్రత్యేక నిధులను తీసుకువస్తానన్నారు. మాటఇస్తే మర్చిపోనని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. ఈసారి ఎన్నికల్లో తనకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## సేవ చేసేందుకు అవకాశమివ్వండి..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నగరంలోని 34వ డివిజన్‌లో సేవ చేసేందుకు ఒక్కసారి అవకాశమివ్వాలని బీఆర్ఎస్ కార్పొరేటర్ అభ్యర్థిని నీతా అర్జున్ రాథోడ్ కోరారు. ఈ మేరకు శనివారం ఆయా కాలనీల్లోని ప్రజలను కలుస్తూ ప్రచారం నిర్వహించారు. నగరంలో బీఆర్ఎస్ హయాంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి జరిగిందని వివరించారు. మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ఆధ్వర్యంలో డివిజన్ అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. డివిజన్‌లో ప్రభుత్వ పథకాల అమలు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాలనీల్లో పలుచోట్ల మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రస్తుత పాలకులు విఫలమయ్యారన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామన్నారు. డివిజన్‌కు రావాల్సిన నిధులను పోరాడి సాధిస్తామని అభివృద్ధి చేసేందుకు ఒక్కసారి తనకు కార్పొరేటర్‌గా అవకాశం ఇవ్వాలని ఆమె ఓటర్లను కోరారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 39వ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



**అక్షరటుడే, ఇందూరు :** ఒక్కసారి తనకు కార్పొరేటర్‌గా అవకాశం ఇస్తే 39వ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థిని దాంపల్లి జ్యోతి మురళీ కృష్ణ అన్నారు. ఈ మేరకు కాలనీల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె కాలనీల్లో తిరుగుతూ ప్రజలతో మమేకమయ్యారు. పలు కాలనీల్లో సమస్యలను ప్రజలు వివరించగా తనను కార్పొరేటర్‌గా గెలిపిస్తే ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించి మేయర్ పీఠం కైవసం చేసుకుందామన్నారు. నగరంలో బీజేపీ ప్రజా ప్రతినిధుల సహకారంతో ముందుకెళ్తామని తెలిపారు. డివిజన్‌లో అనేక సమస్యలను తాము గుర్తించామని.. కార్పొరేటర్‌గా గెలవగానే ముందుగా సమస్యల పరిష్కారంపై దృష్టి పెడతామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ముప్కాల్ కేజీబీవీ పాఠశాలలో వైద్య పరీక్షలు

**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య శాఖ అధికారులు వైద్య పరీక్షలు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్య స్థితిని పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ.. విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తే ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని పేర్కొన్నారు. అలాగే పాఠశాలలోని టాయిలెట్ గదులను పరిశీలించి శుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ వేణుగోపాల్, పాఠశాల ప్రిన్సిపాల్ వినోద, ఆరోగ్య శాఖ సిబ్బంది మనీషా, భూదేవి, పద్మ, ఆశ వర్కర్లు అనిత తదితరులు పాల్గొన్నారు.

## 28వ డివిజన్ అభివృద్ధి బాధ్యత నాదే..



**అక్షరటుడే, ఇందూరు :** తనను కార్పొరేటర్‌గా గెలిపిస్తే 28వ డివిజన్ అభివృద్ధి బాధ్యత తీసుకుంటానని బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థి మల్కాయి మహేందర్ అన్నారు. ఈ మేరకు ఆయా కాలనీల్లో తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఒకసారి తనకు కార్పొరేటర్‌గా అవకాశం ఇస్తే ఆయా కాలనీల్లో గణనీయమైన మార్పులు తీసుకొస్తానన్నారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాలు లేక చాలా కాలనీల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటిని తప్పనిసరిగా పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. నిజామాబాద్ అర్బన్‌లో 'మన ఇందూరు - మన మేయర్' నినాదంతో ముందుకు వెళ్తున్నామని.. ప్రతిఒక్కరూ బీజేపీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ ఎమ్మెల్యే సహకారంతో డివిజన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 19వ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం..



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని 19వ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని బీజేపీ 19వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి నాగోళ్ల లక్ష్మీనారాయణ అన్నారు. ఈ మేరకు కాలనీల్లో పర్యటిస్తూ ప్రజలతో మాట్లాడారు. నిజామాబాద్ అర్బన్‌లో అవినీతి లేకుండా అభివృద్ధి కావాలంటే బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఎంపీ ఎమ్మెల్యే సహకారంతో పూర్తిస్థాయిలో డివిజన్‌ను అభివృద్ధి చేసి చూపిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. తనను ఆదరించే అవకాశం ఇస్తే 19వ డివిజన్‌ను ముందుకు తీసుకెళ్తానన్నారు. ప్రతి ఒక్కరి సమస్యను నా సమస్యగా భావించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి అవినీతి జరగకుండా లబ్ధిదారులకు అందేలా చేస్తానన్నారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మరోసారి అవకాశమివ్వండి..



**అక్షరటుడే, ఇందూరు :** తనకు మరోసారి కార్పొరేటర్‌గా అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని 24వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిని ఇప్పకాయల సుమిత్ర కిషోర్ అన్నారు. డివిజన్‌లోని పలు కాలనీల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. గత మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించినట్టుగానే ఈ ఎన్నికల్లోను తమకు మద్దతు పలకాలని ఇప్పకాయల సుమిత్ర కిషోర్ అన్నారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఐదేళ్లు ప్రజల మధ్యే ఉంటామని వారు హామీ ఇచ్చారు. డివిజన్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. తనను కుటుంబ సభ్యురాలిగా భావించి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను ఆమె కోరారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ ఓట్లు వేయాలని అభ్యర్థించారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీ, ఎమ్మెల్యే సహకారంతో డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఆమె ప్రజలకు హామీ ఇచ్చారు. గతంలో చేసిన అభివృద్ధిని చూపిస్తూ వారు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 9వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతా..



**అక్షరటుడే, భీమ్‌గల్ :** తనకున్న రాజకీయ అనుభవం, పలుకుబడితో వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కాంగ్రెస్ అభ్యర్థి మల్లెల రాజశ్రీ లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. తొమ్మిదో వార్డులో వారు శనివారం ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి తిరుగుతూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. వార్డులో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడమే తన ప్రథమ ప్రాధాన్యమని పేర్కొన్నారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్, రాష్ట్ర సహకార సంఘాల ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ సహకారంతో వార్డు అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. స్థానికురాలిగా, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలపై పోరాడే తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో 'చేతి గుర్తు'పై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రజల వెంటే ఉండి సేవ చేస్తా

**అక్షరటుడే, ఇందూరు :** కార్పొరేటర్‌గా తనకు అవకాశమిస్తే డివిజన్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేసి చూపిస్తానని 35వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ అభ్యర్థి తాటికొండ నరేష్ అన్నారు. ఈ మేరకు కాలనీల్లో ముమ్మర ప్రచారం నిర్వహించారు. తాటికొండ నరేష్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో శనివారం ప్రచారం చేశారు. కాలనీల్లో పలు సమస్యలను ప్రజలు వివరించగా తనను కార్పొరేటర్‌గా గెలిపిస్తే ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రవివరించారు. మాజీ సీఎం కేసీఆర్ నిజామాబాద్ నగరానికి రూ.కోట్లల్లో నిధులు అందించారని గుర్తు చేశారు. నాయకులతో కొట్లాడైనా సరే డివిజన్‌కు నిధులు తీసుకొస్తానని, అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన చెప్పారు.

## వృద్ధురాలి మృతి.. నరబలి అని పుకార్లు!

**అక్షరటుడే, కామారెడ్డి :** జిల్లాలోని ఓ గ్రామంలో వృద్ధురాలి మృతిపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆమెను నరబలి ఇచ్చారని పుకార్లు వ్యాపించడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి మాచారెడ్డి మండలం లోని ఓ గ్రామంలో ఇటీవల ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వకుండా హడావుడిగా అంత్యక్రియలు చేశారు. వారం రోజుల క్రితం ఈ ఘటన చోటు చేసుకోగా.. ఆమెను నరబలి ఇచ్చారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం పోలీసులకు చేరడంతో వారు సైతం గ్రామానికి చేరుకొని పరిశీలించారు. గ్రామానికి చెందిన ఆ వృద్ధురాలి ఇంట్లో ఇటీవల అనేక సమస్యలు నెలకొన్నట్లు తెలిసింది. వాటి పరిష్కారం కోసం కుటుంబ సభ్యులు ఓ తాంత్రికుడిని సంప్రదించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇంట్లో సమస్యలకు నరబలి ఇవ్వడమే పరిష్కారమని చెప్పినట్లు గ్రామస్తులు చెప్పుకుంటున్నారు. దీంతో వృద్ధురాలిని హత్య చేసి ఆ తర్వాత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టుగా చిత్రీకరించారని పుకార్లు వ్యాపిస్తున్నాయి. అంతేగాకుండా ఎవరైనా ఆత్మహత్య చేసుకుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. కానీ వీరు పోలీసులకు సమాచారం ఇవ్వకుండా ఆఘమేఘాల మీద అంత్యక్రియలు చేయడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

సదరు వృద్ధురాలి కుటుంబ సభ్యుల ఆచారం ప్రకారం.. ఖననం చేయాల్సి ఉండగా.. ఆమెను మాత్రం దహనం చేయడం చర్చకు దారి తీసింది. పూడ్చిపెట్టి ఉంటే పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం చేసేవారు. పోలీసులు శుక్రవారం గ్రామంలో పలువురిని విచారించారు. అయితే నరబలికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని సమాచారం. దాంతో గ్రామంలో సీసీ కెమెరా లను పోలీసులు పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం ఈ పుకార్లతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

## కుటుంబ సభ్యుడిగా భావించి ఓటెయ్యండి..



**అక్షరటుడే, ఇందూరు :** నగరంలోని 25వ డివిజన్ కార్పొరేటర్‌గా తనను గెలిపిస్తే ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని బీఆర్ఎస్ అభ్యర్థి చింతకాయల రాజు అన్నారు. కోటగల్లి తదితర ప్రాంతాల్లో శనివారం ఆయన నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం చేశారు. తానెప్పుడూ ప్రజల మనిషినేనని ఎల్లవేళలా వారికి అండగా ఉంటానన్నారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. తనకు డివిజన్‌పై పూర్తి పట్టు ఉందని.. స్థానికుడిగా ప్రతి సమస్యపై అవగాహన ఉందన్నారు. ఒక్కసారి తనకు అవకాశమిస్తే ఐదేళ్లు ప్రజాసేవ చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యుడిగా భావించి తనకు ఓటు వేయాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో నగరంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి జరిగిందని ఓటర్లకు వివరించారు. డివిజన్‌కు రావాల్సిన నిధులను పక్కాగా తీసుకువచ్చి ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పిస్తానని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.